**కథ**

# సతీమణి ఉద్యోగం

చేతిలో ఉన్న డబ్బుకి, కాగితం మీద లెక్కలకి ఎంతకీ పొంతన కుదరకపోవటంతో శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు సుందరం. బిక్క మొహమేసుకుని అతన్నే చూస్తూ ఎదురుగా కూర్చుంది అతని భార్య సుబ్బలక్ష్మి. సుందరానికి ఎంత ఆలోచించినా ఆ వచ్చిన జీతాన్ని అన్నిటికీ ఎలా సర్దాలో అర్థం కావటం లేదు. మళ్ళీ కాగితం వైపు చూసాడు. ఎంత తగ్గుతుందో లెక్క వేసాడు.

అయిదు వందలు తగ్గుతోంది. ఏం చేయాలో, ఎవరికి ఆపాలో కాస్సేపు ఆలోచించాడు. పాలవాడికి ఆపితే మర్నాడు వాడు పాలు బంద్ చేస్తాడు. పోనీ పచారీ కొట్లో ఆపుదామా అంటే బాకీ తీర్చిందాకా మరల అప్పుపెట్టడు.

ఇన్‌స్టాల్‌మెంట్స్ అపుదామంటే వాళ్ళ నోళ్ళు అంత మంచివి కావు. వస్తువు అంటగట్టిందాకా ఎంత మంచి వాళ్ళో, తర్వాత అది వసూలు చేసుకునేటప్పుడు అంత చెడ్డ వాళ్ళు. ఆలోచించగా, చించగా, 'ఇంటి అద్దె ఆపితే సరిపోతుంది'' అన్న ఆలోచన వచ్చింది. ఒక నెల ఆపినంత మాత్రాన ఇల్లు ఖాళీ చేయమని ఏమీ అనరుగా! ఈ ఆలోచన రాగానే సుందరానికి కాస్త రిలీఫ్‌గా అనిపించింది. ఆ రిలీఫ్‌లో వేడి వేడిగా ఓ టీ తాగాలనిపించింది.

''సుబ్బలక్ష్మి కాస్త టీ పెట్టవోయ్'' ఆర్డర్ వేసాడు.

మారుమాట్లాడకుండా సుబ్బలక్ష్మి లేచి వెళ్ళి అయిదు నిముషాల్లో టీ కప్పుతో ప్రత్యక్షమైంది. కప్పు సుందరం చేతికిస్తూ ''ఏమండీ! ఈనెల ఎవరికి ఆపుతున్నారు?'' నెమ్మదిగా అడిగింది.

''ఇంటద్దె ఆపుతున్నాను సుబ్బలక్ష్మీ''

''ఊరుకుంటాడంటారా?''

''తప్పేదేముంది. ఏదో సర్ది చెపుదాం''

కాస్సేపాగి నిదానంగా అంది సుబ్బలక్ష్మి. ''ఏమండీ!''

''ఊ!''

''నేనోమాట చెపుతాను. ఏమీ అనరుగా.''

''ఏమిటది?'' ఏ నగలమీదనో, చీరల మీదకో మనసు మళ్ళినప్పుడే సుబ్బలక్ష్మి అంత గోముగా మాట్లాడేది. అందుకే సుందరానికి గుండెల్లో రైళ్లు పరిగెత్తసాగాయి.

''నాకు..నాకు''

''ఊ, నీకు..చెప్పవే''

''నాకు, నేను ఉద్యోగం చేస్తానండి''

తను ఊహించుకుంటున్న డైలాగులు రాకపోయేసరికి ఊపిరి పీల్చుకున్నాడు. వెంటనే అతనికి నవ్వొచ్చింది.

''ఏమిటి సుబ్బలక్ష్మీ, నువ్వు ఉద్యోగం చేస్తావా?''

''అవునండీ, ప్రతినెలా జీతాల రోజున బడ్జెట్ వేసి ఎటూ చాలక నానా తిప్పలు పడుతున్న మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా జాలిగా ఉందండి. అయినా ఈరోజుల్లో భార్యా, భర్తలిద్దరూ ఉద్యోగం చేస్తేనేగానీ గడవని రోజులు. ఏదో వేణ్ణీళ్ళకి, చన్నీళ్ళు తోడు అన్నట్టు మీ జీతానికి తోడు నేను కూడా ఉద్యోగం చేసి జీతం తెస్తే మన జీవితాలు సాఫీగా సాగుతాయండి''

భార్య మాటలకి నవ్వు వచ్చింది సుందరానికి. ''చూడు సుబ్బలక్ష్మీ. ఉద్యోగం చేయటం అన్నది అంత తేలికైన విషయం కాదు. దాంట్లోనూ ఎన్నో సాధక బాధకాలుంటాయి. ఇప్పుడు నాకొచ్చే జీతంతో మన సంసారం సాఫీగానే సాగుతుంది కదా!''

''సాఫీగా సాగితే ఈనెల ఇంటి అద్దె ఎందుకు ఆపుతున్నట్లు? ఈ నెలే కాదు ప్రతినెల్లా జీతాల రోజున మీరు ఎంత బాధ పడుతున్నారో నాకు తెలుసు. మీ బాధలో నేను కూడా పాలు పంచుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నానండి.''

''సుబ్బలక్ష్మి ఇంటి అద్దె ఆపడానికైనా, అక్కడ, ఇక్కడా అప్పులు చేయటానికైనా కారణం నువ్వేనే!''

''నేనా!''

''అవును. కనపడ్డ వస్తువల్లా ఇన్‌స్టాల్‌మెంట్లో కొంటావు. నెలయ్యేసరికి వాడు వచ్చి పీకల మీద కూర్చుంటాడు. వాయిదా కట్టకపోతే నానా రభస చేస్తాడు. ఆ ఇన్‌స్టాల్‌మెంట్లే లేకపోతే మనం ఎవరికీ బాకీ పడాల్సిన అవసరం లేకపోగా మన చేతిలో ఇంకా డబ్బులు మిగులుతాయి.''

''ఆ మిగులుతాయి. ఎన్నాళ్ళు గడిచినా ఈ గొర్రెతోక జీవితం నావల్ల కాదండి. నలుగురిలో కాస్త హుందాగా బ్రతకాలి గానీ ఎప్పటికీ సామాన్యంగా ఉంటానంటే ఎలాగండి?''

ఇక సుబ్బలక్ష్మితో వాదించటం అనవసరం అనుకున్నాడు. 'అయినా దీనికి ఇప్పుడు పిలిచి ఉద్యోగం ఎవరిస్తార్లే' అనుకుని 'సరేలేవే నీ ఇష్టం. ఏదన్నా జాబ్ వస్తే చేయి. ఉద్యోగం వెతకమంటే మాత్రం నావల్ల కాదు.'' అన్నాడు.

''మీరు వెదకాల్సిన పనిలేదండి. జాబ్ రెడీగా ఉంది.''

''రెడీగా ఉందా!''

''అవునండీ. మా ఫ్రెండ్ విశాలాక్షి చేసే ఆఫీసులో ఖాళీ ఉందట. అది నిన్న మన ఇంటికి వచ్చి చెప్పింది.''

''అలాగా! విశాలాక్షికి సుబ్బలక్ష్మితోడన్నమాట. ఇంతకీ జీతం ఏమాత్రం ఇస్తారో?''

''పదిహేను వందలు ఇస్తారటండి. తర్వాత్తర్వాత ఇంకా పెరుగుతుంది.''

''పరవాలేదే, స్టార్టింగ్ పదిహేనువందలు ఇస్తున్నారు. ఇంతకీ తమరి క్వాలిఫికేషన్ వారికి తెలుసా?''

''ఎందుకు తెలియదండి. విశాలాక్షి కూడా నాతోపాటు ఇంటర్ డిస్ కంటిన్యూ చేసింది కదండి.''

''ఇంటర్ ఫెయిల్ అని మాత్రం చెప్పుకోదు గదా'' తనలో తాను గొణుక్కున్నాడు.

''ఏమిటంటున్నారు?''

''ఏమీ లేదు. నువ్వు ఉద్యోగం చెయ్యక తప్పదంటావా?''

''ఇందులో తప్పులేదు కాబట్టి చెయ్యక తప్పదు. అయినా ఇంత మంచి అవకాశం మళ్ళీ మళ్ళీ రాదండి.''

''అవుననుకో. కానీ, ఈ ఉద్యోగం వేరే ఎవర్కైనా వదిలెయ్యటం వలన ఆ కుటుంబం మొత్తం కడుపునిండా తింటారే!''

''ఇప్పుడు మన కడుపులు అంతనిండుగా ఏమీ లేవు కానీ, మీరు మాత్రం ఇక అడ్డు తగలకండి.''

''ఊ'' అనక తప్పలేదు. సుందరానికి. తనకి కష్టాలు మొదలయ్యాయని ఆ క్షణాన ఊహించకలేపోయాడు.

★★★

సుబ్బలక్ష్మి ఉద్యోగంలో చేరింది.

నాలుగు రోజులు గడిచిన తర్వాతగానీ సుందరానికి తన ఇబ్బందులు తెలిసిరాలేదు. సుబ్బలక్ష్మి చేసే ఆఫీసుకి, తమ ఇంటికి దూరం ఎక్కువ కావటంతో సుబ్బలక్ష్మి ఉదయమే లేచి వంటా, వార్పూ చేసుకుని సుందరానికంటే ముందే ఇంట్లోంచి బైటపడేది. సుందరం ఆఫీసు ఇంటికి దగ్గరే కావటంతో పదికి పది నిముషాల ముందు బయల్దేరినా సరిపోయేది. ఈ కారణంగా సుబ్బలక్ష్మి వెళ్ళిపోయాక తనే వడ్డించుకుని ఓ ముద్ద అన్నం తిని ఇంటికి తాళం వేసి ఆఫీసుకి వెళ్ళేవాడు. టిఫిన్స్ అన్నీ బంద్ అయ్యాయి. కూరలు కూడా ఏది తక్కువ టైమ్‌లో అవుతుంది అనుకుంటే అది. ఒక్కోరోజు అదీ ఉండేది కాదు. మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో ఇంటికి వచ్చి ఒక్కడే కూర్చుని నాలుగు మెతుకులు కతికి మళ్ళీ ఆఫీసుకి వెళ్ళిపోయేవాడు. సాయంత్రం సుందరం వచ్చాక గంటన్నరకిగానీ సుబ్బలక్ష్మి ఇల్లు చేరేది కాదు. ఈ లోపు అతనికి టీవీనే దిక్కయ్యేది. అది చూసి తలనొప్పి తెచ్చుకుని కాస్త టీ పెట్టుకుందామంటే గిన్నెలన్నీ అంట్లలోనే ఉండేవి. సుబ్బలక్ష్మి వచ్చాక టీ పెట్టి ఇస్తుందిలే అనుకుంటే ఆవిడగారు వచ్చి కాస్సేపు రిలాక్స్ అయి, తర్వాత అంట్లు కడిగి టీ పెట్టేటప్పటికి రాత్రి భోజనాల టైమ్ అయ్యేది. అప్పుడు వంట మొదలుపెట్టి భోజనాలు పూర్తయ్యేసరికి ఏ టైమ్ అవుతుందో చెప్పక్కర్లేదను

కుంటా. పని పూర్తయి బెడ్ ఎక్కేటప్పటికి నిద్రతోపాటు, మళ్ళీ ప్రొద్దుటే లేవాలన్న టెన్షన్ ఉండటం వల్ల ఇక వేరే కార్యక్రమాలకి అవకాశమే లేదు.

ఈ విధంగా సుందరానికి బ్రతుకు భారమైపోయింది. అయినా సుబ్బలక్ష్మి మీద అతనికి జాలి తప్ప కోపం రాలేదు.

***

ఓ వారం రోజులు తర్వాత-

ఆఫీసు నుండి కాస్త ఆలస్యంగా ఇంటికి వచ్చిన సుబ్బలక్ష్మి చేతిలో నాలుగైదు బ్యాగులు ఉన్నాయి. ఆమె మొహంలో రోజూ కనపడే అలసట కనపడకపోగా ఎంతో హుషారు కనిపించింది సుందరానికి. ఆ ప్యాకెట్స్ తీసి ఒక్కొక్కటీ సుందరానికి చూపించసాగింది. ఓ నాలుగు చీరలు, రెండు జతల చెప్పులు, రెండు హ్యాండ్ బ్యాగులు, నాలుగు డజన్ల బ్యాంగిల్స్, పది రకాల బొట్టు బిళ్ళల ప్యాకెట్స్, నెయిల్ పాలిష్ బాటిల్స్ అన్నీ ఇటువంటివే ఉన్నాయి. వాటిని చూసిన సుందరానికి కళ్ళు తిరిగినంత పనయింది.

''ఏమిటి సుబ్బలక్ష్మీ, ఇవన్నీ కొన్నావా?'' కొట్టుకొచ్చావా అని అడిగినట్లు అడిగాడు.

''అవునండీ. ఈరోజు మా ఆఫీసుకి చీరలమ్మే వ్యక్తి వచ్చాడు. అతని దగ్గర ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ఈ చీరలు తీసుకున్నానండి. ఫస్ట్ ఓ అయిదు వందలు కట్టి, మిగతా డబ్బు మూడు వాయిదాల్లో కడితే చాలన్నాడు. మిగతా వెయ్యి రూపాయలు మూడుసార్లుగా కడితే సరిపోతుంది. అందుకని మా ఫ్రెండ్ విశాలాక్షి దగ్గర ఓ అయిదు వందలు తీసుకుని అతనికి కట్టానండి.''

''అంటే చీరలే పదిహేను వందలా!? మరి మిగతా వాటి సంగతి!''

''అవి ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ఎవరిస్తారండి. నేను తీసుకున్న వెయ్యి రూపాయల అడ్వాన్స్‌తో కొన్నాను.''

''వేయి రూపాయలు అడ్వాన్సా!''

''అవునండీ. మా మేనేజరుగారు అడిగి మరీ ఇచ్చారు. ఆయనకు నా మీద ఎంత ఆపేక్షో. ఆయన్ని చూస్తుంటే చనిపోయిన మా నాన్న గుర్తొస్తున్నాడండి. నా వర్క్ చూసి ఆయన తెగ సంబరపడిపోతున్నాడంటే నమ్మండి.'' కళ్ళని చక్రాల్లా తిప్పుతూ చెప్పుకుపోతున్న సుబ్బలక్ష్మి మొహంలోకి చూడలేకపోయాడు సుందరం.

''సుబ్బలక్ష్మీ, ఇంత ఖర్చుపెట్టి ఇప్పుడివన్నీ కొనటం అవసరమంటావా?'' నీరసంగా అడిగాడు సుందరం.

''అవసరమా అని నిదానంగా అడుగుతారేమిటండి. చాలా అవసరం. ఉద్యోగానికి బైటకెళ్ళే ఆడది ఎంత హుందాగా ఉండాలి. అసలు అలా లేకపోతే మీకు ఎంత నామోషీ. రోజూ కట్టిన చీరే కట్టటం, మ్యాచింగ్ సరిపోని చెప్పులు, గాజులు వేసుకోవటం ఎంత అసహ్యంగా ఉంటుంది. ఏదో ఇంట్లో ఉంటే ఎలా ఉన్నా పరవాలేదు. బైటకు వెళ్ళేటప్పుడు అలా ఎలా కుదురుతుందండి.''

''నిజమేనేమో'' అనిపించింది సుందరానికి.

''ఏవండీ!''

అంత మృదువుగా పిలిచిన సుబ్బలక్ష్మి వంక భయంగా చూసాడు.



''మరే మనమో పనిమనిషిని, చాకలిని పెట్టుకుంటే బాగుంటుందండి.''

''వ్వాట్?''

''అవునండీ. ఉదయం లేచిన దగ్గర్నుంచీ, ఆఫీసుకి వెళ్ళేవరకూ, ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి మరల పడుకునీ వరకూ నాకు పనితోనే సరిపోతుంది. మీతో సరదాగా గడపటానికి అసలు టైమ్ లేకుండా పోతుంది అందుకని..''

''అందుకని ఇప్పుడు వందలుపోసి..''

**జి. పి. కిరణ్**

''ఇద్దరం సంపాదిస్తున్నాం కదండి. ఇది మన సుఖం కోసమే. అయినా ఈ ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ మీకే విధమైన సుఖం ఇవ్వలేక పోతున్నానన్నదే నా బాధ.''

''అయితే ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చో. అంతా సవ్యంగా ఉంటుంది.''

''అహ! ఎంత మాట. ఇంటిపనికోసం బంగారం లాంటి జాబ్ వదులుకుంటామా! ఓ పని చేద్దామండి.''

''ఏమిటది?''

''అత్తయ్య, మామయ్య ఆ పల్లెటూర్లో ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో! వారిని ఇక్కడికి తీసుకు వచ్చేస్తే...వాళ్ళకి, మనకి సుఖంగా ఉంటుందీ కదండీ.''

సుందరానికి తలగిర్రున తిరగసాగింది. ''ఈ ఆడవాళ్ళకి భగవంతుడు ఎంత లౌఖ్యం పెట్టాడు. తన అమ్మా, నాన్న ఎప్పుడన్నా చుట్టం చూపుగా వస్తేనే మూతి ముడుచుకుని, మూల కూర్చునే సుబ్బలక్ష్మి ఇప్పుడు ఏకంగా వాళ్ళని ఇక్కడే ఉంచేసుకుందాం అంటుందంటే అందులోని మర్మాన్ని అర్థం చేసుకోలేని అమాయకుడేం కాదు తను.''

''ఊహు! అది కుదరదు సుబ్బలక్ష్మి. వాళ్ళు పుట్టి పెరిగిన ఆ ఊరు వదిలి రారు.''

''అయితే గంగని, మంగని రేపే రమ్మంటాను.''

''వాళ్ళెవరు?''

''వాళ్ళే మన ఇంట్లో పనికి, బట్టలుతకటానికి నేను కుదుర్చుకున్న వాళ్ళు. ఇద్దరికీ కల్పి రెండొందల యాభయ్యేనండి.''

''తప్పదంటావా!''

''తప్పదండీ. మన సుఖం కోసమే కదా!''

''నిజమేనేమో' అనిపించింది సుందరానికి.

★★★

వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న సుందరం ఎదుటికి గంగ, మంగ వచ్చి నిలబడ్డారు. ఏమిటన్నట్లు తలపైకెత్తి చూసాడు సుందరం. అతని చూపుని అర్థం చేసుకుని నోరు విప్పింది గంగ.

''బాబుగారూ జీతం కావాలండి.''

''అదేంటే, మీకింకా నెల కాలేదుగా. అప్పుడే జీతం అంటారేంటి?'' నోట్లో దువ్వెన పెట్టుకుని, జడ అల్లుకుంటూ బైటకు వస్తూ అంది సుబ్బలక్ష్మి. ఇక తనకు సంబంధం లేదన్నట్లు పేపర్లో తల దూర్చాడు సుందరం.

''మేము పదో తారీఖున పనిలో జేరామమ్మా. ఇయ్యాల అయిదు. నెల పూర్తవటానికి ఇంకా అయిదురోజులేగా ఉంది.''

''అపుడే తీసుకోండి.''

''అలా కాదమ్మా. మేము ఈరోజు చీటీలు కట్టాల. అయినా మీకంత అనుమానం ఏమీ అక్కరలేదు. నాల్రోజులు ముందు డబ్బులుచ్చుకుని మేమేమీ ఊరిడిచి పోము. త్వరగా ఇవ్వండమ్మా, అవతల చాలా పనులున్నాయి.'' మంగ వాయిస్ పెరగటం ఇద్దరూ గ్రహించారు.


''ఏవండీ!''

''ఓ రెండొందల యాభై ఇచ్చి పంపించండి.'' నోట్లో దువ్వెన తీసి బొడ్లో దోపుకుంటూ అంది.

మారు మాట్లాడకుండా లోనికి వెళ్ళి తన పర్సులోంచి డబ్బు తీసి వాళ్ళకిచ్చి పంపించాడు. తర్వాత పర్సులో చూస్తే ఇంకో మూడొందలు మాత్రమే ఉన్నాయి. సుబ్బలక్ష్మితో మాట్లాడబుద్ధికాక పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

కాస్సేపటికి హైహీల్స్ టకటక లాడించుకుంటూ, బ్యాగ్ ఊపుకుంటూ సుందరం దగ్గరకొచ్చింది సుబ్బలక్ష్మి.

''ఏవండీ!'' మరే మీ పర్స్‌లో ఉన్న మూడొందలు తీసుకున్నాను. కంగారు పడకండి'' అని వెళ్ళబోయింది.




ఆ మాట వింటూనే ఒక్క దూకు దూకి సుబ్బలక్ష్మి జబ్బ పట్టుకుని ''అవెందుకే నీకు? ఈనెల నా జీతంలో మిగిలింది ఆ మూడొందలేనే. ఇంకా అద్దె కట్టలేదు. పోయిన నెలది కూడా కట్టాలి. నన్నెందుకే ఇలా ఏడిపిస్తున్నావు?'' నిజంగానే ఏడుపొస్తుంది సుందరానికి.

'' అయ్యో మీరేడవటం ఏమిటండి. ఈ డబ్బు సరదాల కోసం తీసుకోలేదండి. అవసరమయ్యే తీసుకున్నాను.''

''అవసరమా! ఏమిటే అది?''

''బస్ పాస్ తీసుకుంటున్నానండి. రోజూ ఛార్జీల కోసం డబ్బులు వెదుక్కోవటం, తీరా బస్సెక్కాక ఆ కండక్టర్ చిల్లర ఎగ్గొట్టటం చాలా చిరాగ్గా ఉందండి. అందుకని..అయినా మీరంత వర్రీ అవుతారెందుకు? ఈ రోజు నాకు జీతం వస్తుందిగా. అది తెచ్చి మీకేగా ఇస్తాను. మీరేం చేస్తారో మీ ఇష్టం.''

''జీతం వస్తుందంటున్నావు. మరి ఈ డబ్బెందుకే? ఆ జీతం డబ్బులతోనే పాస్ తీసుకోవచ్చుగా!''

''శాలరీ ఎప్పుడో సాయంత్రం ఇస్తారు. విశాలాక్షి పాస్ ఈరోజు కట్టాలట. అటెండర్‌ని పంపిస్తానంది. దానితోపాటు నేను కూడా తెప్పించుకుంటాను. మళ్ళీ రేపు అతన్ని వెళ్ళమంటే బాగుండదు కదా!''

సుందరానికి ఏం మాట్లాడాలో తోచలేదు. అతడా అయోమయావస్థలో ఉండగానే 'బై' చెప్పేసి వెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

★★★

ఆఫీసు నుంచి తిన్నగా ఇంటికి వచ్చి కూర్చుని సుబ్బలక్ష్మి కోసం ఎదురుచూడసాగాడు సుందరం. సుబ్బలక్ష్మి కన్నా ముందు హౌస్ ఓనర్ వచ్చాడు. అతడ్ని చూడగానే లోపల దడగా ఉన్నా నవ్వుతూ పలకరించి కూర్చోపెట్టి, సుబ్బలక్ష్మి రాగానే అద్దె కట్టేస్తానని విన్నవించుకుని అతని చేతిలో ఆ రోజు దినపత్రిక పెట్టాడు. కాస్సేపటికి కాళ్ళీడ్చుకుంటూ సుబ్బలక్ష్మి వచ్చింది. అతని ముందే మాట్లాడుకుంటే బాగుండదని సుబ్బలక్ష్మితోపాటు లోనికి వెళ్ళాడు సుందరం.

''ఇంటి ఓనర్ అద్దె డబ్బుల కోసం వచ్చాడు. పోయిన నెలది, ఈ నెలది కలిపి వెయ్యి రూపాయలు ఇవ్వాలి. ఇచ్చేయ్. పంపించేద్దాం!''

''వెయ్యి రూపాయలా! ఏవండీ!''

సుందరానికి హార్టుబీట్ పెరగసాగింది. ''ఏమిటే జీతం ఇంకా ఇవ్వలేదా?''

''ఇచ్చారండి. మరేమో విశాలాక్షి దగ్గర అయిదొందలు తీసుకున్నాను కదండి. ఆ బాకీ తీర్చేసా. అక్కడికీ దానితో చెప్పా. సగం తీసుకోవే, మిగతా సగం వచ్చే నెల ఇస్తానని. ఒప్పుకుని చావలేదు దొంగ మొహంది. ఏదో అవసరమని గట్టిగా దబాయించింది.''

''పోనీలేవే అప్పు తీరింది కదా! మిగిలిన వేయి రూపాయలు ఇవ్వు.''

''వెయ్యెక్కడ మిగులుతాయండి. చీరలబ్బాయికి నాల్గొందలు ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాను గదా!''

సుందరానికి పరిస్థితి కొంచెం, కొంచెం అర్థమవసాగింది.

''మిగతా ఆరువందలైనా!''

''ఆరొందలు ఎలా ఉంటాయండి. మీరు మరీ అమాయకంగా అడుగుతారు. ఆఫీసులో అడ్వాన్స్ బాపతు మూడొందలు కట్ చేసి మిగతాదిచ్చారు.''

''అంటే నీ జీతంలో మూడొందలు మిగుల్చుకొచ్చావన్న మాట.'' సుందరానికి గుండె దడగా ఉంది.

''లేదండి. ఆ డబ్బుల్తో బస్ పాస్ తీసుకున్నాను.''

''అదేమిటి. బస్ పాస్‌కని ఉదయం డబ్బులు తీసుకెళ్ళావుగా!''

''అన్నట్టు మీకు చెప్పనేలేదు కదూ. ప్రొద్దుట బస్‌లో నా హ్యాండ్ బ్యాగ్ ఎవడో దొంగ కొట్టేసాడండి. ఆ డబ్బులు అందులోనే ఉన్నాయి. ఆఫీసుకి వెళ్ళి ఈ విషయం చెప్పి జీతం తీసుకుని వెంటనే పాస్ తెప్పిచ్చుకున్నానండి..''

సుబ్బలక్ష్మి చెప్పుకుపోతోంది. సుందరానికి ఏమీ వినపడటం లేదు, బైట కూర్చున్న ఇంటి ఓనర్ కేకలు తప్ప. నెమ్మదిగా గొంతు పెగల్చుకుని అన్నాడు. ''సుబ్బలక్ష్మీ! రేపట్నుంచి నువ్వు ఎక్కడికీ వెళ్ళకే. ఉద్యోగం, సద్యోగం ఏమీ వద్దే. నా మాట వినవే!''

''ఇప్పుడలా అంటే ఎలా కదురుతుందండీ!''

''ఏ, ఎందుక్కుదరదు?''

''ఎందుకంటే, చీరలకి ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టాలి. ఆఫీసులో అడ్వాన్స్ బాకీ తీరాలి. రెండు, మూడు నెలల దాకా ఉద్యోగం చెయ్యక తప్పదండీ.''

''నిజమేనేమో' అనుకుంటూ దబ్బున నేలమీద పడ్డాడు సుందరం.

★★★

(మనవి:- ఉద్యోగం చేసే ఆడవాళ్ళందరూ సుబ్బలక్ష్మిలా ఉంటారని కాదు గానీ, ఇలాంటివాళ్ళు కూడా ఉన్నారన్నది మాత్రం వాస్తవం. అరె, భుజాలు తడుముకోకండి. మీరు కాదులే!)

★